## క్లుప్తంగా

### టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు


ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

**పూతలపట్టు:** మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు ప్రారంభించినట్లు హెచ్‌ఎం దామోదరనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు స్టడీ అవర్ కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో రోజూ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నేడు రేషన్ డీలర్ల సమావేశం

**గుడిపాల:** మండలంలోని రేషన్‌షాప్ డీలర్లతో బుధవారం ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. జనవరి నెలకు సంబంధించి డీలర్లకు బియ్యం తూకాల్లో తేడాలు రావడంతో డీలర్లందరూ ఫిర్యాదు చేశారని, ఇందుకోసం చిత్తూరులోని గోడౌన్ వారితో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీంతో పాటు డీలర్ల సమస్యలు ఏవైనా ఉంటే సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

### వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులకే మా మద్దతు

**చిత్తూరు కలెక్టరేట్ :** వైఎస్సార్ సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికే తమ మద్దతు అని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం ప్రకటించారు. మంగళవారం చిత్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సభ్యులు తమ సంఘం మద్దతు తెలిపిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

### ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**చిత్తూరు రూరల్:** పక్కా గృహ నిర్మాణ పనుల్లో వేగం పుంజుకోవాలని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలోని జగనన్న లేవుట్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. పనుల ప్రారంభించడంలో నిర్లక్ష్యంగా ఉన్నవారికి అవగాహన కల్పించి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు.

### ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

**చిత్తూరు కలెక్టరేట్:** ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు రూపొందించిన డైరీని డీఈఓ విజయేంద్రరావు మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణమూర్తి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామమూర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మునిరత్నం పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

### మాతా శిశు మరణాల కట్టడికి కృషి చేయాలి

**చిత్తూరు రూరల్:** మాతా శిశు మరణాల కట్టడికి అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి జి. ప్రకాశం, డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం మాతా శిశు మరణాలపై వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. మరణాలపై అధికారులను ఆరా తీశారు. అత్యవసర సేవల్లో 108, 102 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉషశ్రీ , నీలిమ, మీనాకుమారి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

### టీచర్ల మధ్య వివాదం.. పంచాయితీలో రాజీ

**చిత్తూరు అర్బన్:** మున్సిపాలిటీలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న మనస్పర్థలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేంత వరకు వెళ్లింది. ఆపై యూనియన్ నాయకులు పంచాయితీ పెట్టి రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు వేతనాల బిల్లులు రాసేందుకు అందరి సర్వీసు రిజిస్టర్లు (ఎస్ఆర్) తీసుకుంటుంటాడు. అయితే ఓ మహిళా టీచర్ ఎస్ఆర్‌ను సకాలంలో ఇవ్వకపోవడంతో వేతన బిల్లు ఆలస్యమయ్యిందని గట్టిగా మాట్లాడాడు. దీంతో ఆమె రెండు రోజుల క్రితం చిత్తూరులోని కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పోలీసులకు పంపడంతో.. వారు విచారణ జరిపారు. అయితే యూనియన్ నాయకులతో పంచాయతీ పెట్టి ఉపాధ్యాయులు రాజీ కుదుర్చున్నట్లు తెలిసింది.

# పల్లెలు.. ప్రగతి మల్లెలు

పూతలపట్టు నియోజకవర్గంలో పల్లెల రూపురేఖలు మారుతున్నాయి. ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లేందుకు సచివాలయ వ్యవస్థను, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులు మండల కేంద్రాలకు వెళ్లే పని లేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పింది. వారికవసరమైన అన్ని సేవలు, సాంకేతిక సలహాలను ఈ కేంద్రాలోనే అందిస్తున్నారు. ఇందుకోసం నియోజకవర్గ వ్యాప్తంగా కొత్త భవనాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వాటి కోసం ప్రభుత్వం రూ.71.2 కోట్లు వెచ్చిస్తోంది. ప్రస్తుతం గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి.

- పూతలపట్టు నియోజకవర్గంలో రూ.71.2 కోట్లతో ప్రభుత్వ భవనాలు
- 98 సచివాలయాలు, 95 ఆర్బీకేలు, 68 హెల్త్ క్లినిక్‌లు
- ఇప్పటికే 54 భవనాలు పూర్తి
- మార్చినాటికి పూర్తయ్యేలా కార్యాచరణ


తవణంపల్లె మండలం పల్లెచెరువు రైతు భరోసా కేంద్రం

**ఐరాల:** పూతలపట్టు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. 98 గ్రామ సచివాలయాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.39.20 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.40 లక్షల చొప్పున కేటాయించారు. ఇప్పటికే 16 భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఐరాల మండలంలో ఒక సచివాలయం బేస్‌మెంట్ స్థాయిలో ఉంది. మిగిలిన 81 భవనాలు వివిధ దశల్లో నిర్మాణాలు వేగంగా జరుగు తున్నాయి.అలాగే 95 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ఒక్కో భవనానికి రూ. 21.50 లక్షల చొప్పున మొత్తం రూ.20.42 కో ట్లు

**మార్చి నెలాఖరుకు పూర్తి**

మార్చి నెలాఖరు నాటికి అన్ని భవనాల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం మండల స్థాయి అధికారులకు కార్యచరణ రూపొందించాం. కాంట్రాక్టర్లు పనులు విడిచి పెట్టడం, పనులను ఆలస్యం చేయడం కారణంగా భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్యచరణ రూపొందిస్తాం.

– మహేష్‌కుమార్, డీఈ, పూతలపట్టు నియోజకవర్గం



పూతలపట్టులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఐరాల మండలం చిన్నవెంకటపల్లె విలేజ్ క్లినిక్

మంజూరయ్యాయి. ఇప్పటికే 20 ఆర్బీకేల నిర్మాణాలను పూర్తి చేశారు. రెండు భవనాలు పునాది స్థాయిలో ఉన్నాయి. పది బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. పది భవనాలు రూఫ్‌లెవల్‌లో, మిగిలిన 53 భవనాలు శ్లాబ్‌లు పూర్తి చేసుకుని తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి

**రూ.11.90 కోట్లతో హెల్త్ క్లినిక్‌లు**

గ్రామీణులకు స్థానికంగా వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. నియోజకవర్గంలో 68 క్లినిక్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.11.90 కోట్లు కేటాయించింది. ఒక్కో భవనానికి రూ17.50 లక్షల చొప్పున ఖర్చు చేస్తున్నారు. ఇప్పటివరకూ 18 చోట్ల భవనాల నిర్మాణాలు పూర్తి చేశారు. మూడు భవనాలు పునాది స్థాయిలో, ఎనిమిది బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. రూఫ్‌లెవల్‌లో 17 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 21 భవనాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి.

# ఏకాంబరేశ్వరా పాహిమాం

**యాదమరి:** మండల కేంద్రంలోని శ్రీఏకాంబరేశ్వర స్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల ఓం నమఃశివాయ నామస్మరణల నడుమ రథోత్సవం జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. అనంతరం పార్వతి పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువుదీర్చి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో కొలువు తీర్చి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి రథోత్సవం ప్రారంభమైంది. భక్తులు కర్పూర మంగళహారతులు సమర్పించారు.

**లంకేశ్వరుడిపై లయకారకుడు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి రావణబ్రహ్మ వాహనంపై పార్వతీపరమేశ్వరులు పురవీధుల్లో విహరించారు. తొలుత అలంకార మండపంలో


రథాన్ని లాగుతున్న భక్తులు

ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కళా ప్రదర్శనలు ముందు సాగుతుండగా ఊరేగింపు వైభవంగా జరిగింది.

# అధికార నందిపై ఆదిదంపతులు


అధికార నంది వాహనంపై విహరిస్తున్న ఆదిదంపతులు


పూజా సామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు

**తవణంపల్లె:** మండల కేంద్రంలోని ప్రముఖ శ్రీకాళభైరేశ్వర ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అధికారి నంది వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. రాత్రి అధికారి నంది వాహన సేవ నిర్వహించారు. ఉభయదారులు మొదలియార్ కులస్తులు తొలుత పూజా సామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం శివ పార్వతుల ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించి నూతనంగా తయారు చేసిన అధికార నంది వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, భక్తుల శివనామస్మరణ నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. భక్తులు ఇంటింటి వద్ద కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. దేవదాయశాఖ జిల్లా అధికారి జె.ఏకాంబరం, దేవస్థానం ఈఓ వెంకటసుబ్బారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**నేడు పుష్పపల్లకి**

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు ఉంటాయని ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. రాత్రి పుష్ప పల్లకి సేవ వైభవంగా జరుగుతుందని, భక్తులు అశేషంగా పాల్గొని పునీతులు కావాలని కోరారు.

# ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

**ఐరాల:** ఈ–క్రాప్ నమోదు తప్పనిసరని గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ సునీత సూచించారు. మంగళవారం మండలంలోని 45 కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, దామరగుంట, లింగారెడ్డిపల్లెలో పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలకు సూచించారు. పంట నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, కనీస మద్దతు ధర తదితర లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లా ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఏఓ వరలక్ష్మి, ఎంపీఈఓ దీపిక, వీఏఏలు సంతోష్, హేమంత్ పాల్గొన్నారు.

**పంట నమోదు తప్పనిసరి**

**తవణంపల్లె:** రైతులు విధిగా పంటల వివరాలను నమోదు చేయించాలని వ్యవసాయశాఖ గుం


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ సునీత

టూరు కమిషనరేట్ ఏడీఏ సునీత తెలిపారు. మంగళవారం మండలంలోని టి.పుత్తూరు, దిగువ మోదలపల్లె, ఎగువ మోదలపల్లె, పొన్నేదుపల్లె గ్రామాల్లో ఇప్పటి వరకు నమోదు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఆర్‌బీకే సేవలు ఎలా అందుతున్నాయని రైతులను అడిగారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, వీహెచ్ఏ శ్రీధర్ పాల్గొన్నారు.

# సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం

**గంగాధరనెల్లూరు:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వన్నియకుల క్షత్రియ కులానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఆయన టీడీపీకి సేవ చేసినా గుర్తింపు లేకపోవడంతో బయటకు వచ్చారన్నారు. ఎన్నడూ లేని విధంగా అనేక మంది ఎమ్మెల్సీ సీట్లను బీసీలకు కేటాయించడంతో సీఎం పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బీసీలకు సముచిత స్థానం కల్పించి, పేదల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. వైస్‌ఎంపీపీ హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నా యకులు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

### నేడు జిల్లాకు మంత్రి ఆదిమూలపు సురేష్

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ నెల 22వ తేదీన జిల్లాకు రానున్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆయన బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరుకు విచ్చేస్తారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు నుంచి బయలుదేరి, తిరుపతి జిల్లాకు వెళతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

### నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**బంగారుపాళెం:** స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లచే ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు.

### సరకల్లులో ఫ్యామిలీ డాక్టర్

**తవణంపల్లె:** మండలంలోని సరకల్లులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధి కారి డాక్టర్ దాత్రేయ చౌదరి 79 మంది రోగులకు వైద్య పరీక్ష లు నిర్వహించారు. గర్భిణులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్ సూపర్ వైజర్లు అమరావతి, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### భక్తాంజనేయస్వామికి విశేష పూజలు

**గంగాధరనెల్లూరు:** వేపంజేరిలోని భక్తాంజనేయస్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అభిషేక పూజలు చేశారు. వడమాల సమర్పించి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గోపూజ నిర్వహించారు. భక్తులు గోమాతకు పూజలు చేసి, ప్రదక్షిణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### వలసలు ఆపాలి

**పెనుమూరు(కార్వేటినగరం):** రానున్న వేసవి కాలంలో ఉపాధిహామీ కూలీలు వలస పోకుండా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ గంగాభవానీ అన్నారు. మంగళవారం మండలంలోని గుంటిపల్లె, కావూరివారిపల్లె పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కూలీలతో ముఖాముఖి నిర్వహించి, దినసరి వేతనం ఎంత వస్తుందని ఆరా తీశారు. రోజు వారీ కూలీ ఎంత వస్తుందని అడిగారు. రోజువారి రూ.250 వస్తుందని కూలీలు సమాధానం చెప్పారు. అనంతరం పీడీ మాట్లాడుతూ వేసవికాలంలో కూలీలు వలసలు పోకుండా అందరికీ పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గుణశేఖర్, ఈసీ సతీష్, టీఎలు మదివన్నణ్,బాబు, వినోద్, వెంకటేష్ పాల్గొన్నారు.

### చందనాలంకరణలో బంగారమ్మ

**కార్వేటినగరం:** గ్రామదేవత బంగారమ్మ మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువ జామున పాలు, పెరుగు, పసుపు, తేనే, నారికేళ జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం చందనంతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

# మాతృభాష తల్లివంటిది


గుడిపాల: మాట్లాడుతున్న హెచ్‌ఎం సబర్‌మతి


బంగారుపాళెం: వివిధ వేషధారణల్లో విద్యార్థులు


చిత్తూరు: రచయితను సన్మానిస్తున్న నిర్వాహకులు

**గుడిపాల:** మాతభాష తల్లిపాల వంటిదని, పర భాష దాదిపాల వంటిదని మాతృభాషా పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు సి.అర్జున్, నరహరిపేట పాఠశాల హెచ్‌ఎం సబర్‌మతి పేర్కొన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలోని సీఎస్ఆర్ కళాశాల, నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులకు పద్యపఠన, తెలుగులో మాట్లాడటం తదితర పోటీలను నిర్వహించారు.

**అలరించిన పద్యపఠనం**

విద్యాపఠన పోటీలో ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులు పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాగయుక్తంగా వారు ఆలపించిన వేమన, సుమతి శతక పద్యాలు అందరినీ అలరించాయి. విజేతలకు బహుమతులు ప్రకటించారు. సమావేశంలో తెలుగు అధ్యాపకుడు అర్జున్, సరళ, పద్మ, భాస్కర్‌నాయుడు ఆలపించిన గేయాలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధినేత లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర పాల్గొన్నారు.

**తెలుగు మహోన్నతమైన భాష**

**బంగారుపాళెం:** మండలంలోని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇరసయ్య మాట్లాడుతూ తెలుగు మహోన్నతమైన భాష అని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి సాహితీవేత్తలు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు ఉపాధ్యాయులు మురగయ్య, పూర్ణ మాట్లాడుతూ అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగుభాషపై విద్యార్థులు పట్టుసాధించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తెలుగు భాషపై పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం**

**చిత్తూరు రూరల్:** నగరంలోని సంతపేటలో ఉన్న లలిత కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం మాతృభాషాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలువురు సాహితీ వేత్తలు, రచయితలు మాట్లాడారు. అనంతరం వేదిక నిర్వాహకులు రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, బ్రహ్మానందరెడ్డి, హరినాయుడు, మునస్వామి, భాస్కర్‌రెడ్డి, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సమాజ కర్తవ్యం

- సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్మికశాఖ కమిషనర్ ఓంకార్, జడ్జి కరుణకుమార్

**చిత్తూరు, అర్బన్:** బాల కార్మిక, వెట్టి చాకిరి వ్యవస్థను నిర్మూలించడం సమాజంపై ఉన్న ప్రధాన కర్తవ్యమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ పిలుపునిచ్చారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్, చిత్తూరు ఆర్డీఓ రేణుకతో కలసి మంగళవారం చిత్తూరులోని న్యాయసేవా సదన్ భవనంలో బాల కార్మికులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించే అంశంపై తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీసు, రెవెన్యూ, కార్మిక, వైద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలతో పాటు, స్వచ్ఛంద సంస్థలతో అవగాహన సదస్సు నిర్వహించారు. కరుణకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే పక్షం రోజుల పాటు ఆపరేషన్ స్వేజ పేరిట జిల్లాలో వారోత్సవాలు నిర్వహించి పలువురిని వెట్టి చాకిరీ నుంచి విముక్తి చేసినట్లు చెప్పారు. ప్రతిశాఖతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెట్టిచాకిరి వ్యవస్థను పూర్తిగా నిర్మిలించేందుకు సహాయ పడాలన్నారు. 45 సంవత్సరాల క్రితమే వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చినా.. ఇప్పటికీ పిల్లలతో పని చేయించడం మంచిదికాదన్నారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపుతామన్నారు. కార్మికులకు కనీసం వేతనం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన కనీస వేతన చట్టం అన్ని చోట్ల అమలయ్యేలా చూస్తామన్నారు. బాల్య వివాహాలు కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయక సాంఘిక సంక్షేమ అధికారి, నాగేశ్వరరావు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# పన్నులు వసూలు చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

**చిత్తూరు అర్బన్:** వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు పక్కాగా అందించాలని, ఇదే సమయంలో నగరపాలక సంస్థ ఆదాయం పెంచేలా పన్నుల వసూలు చేయాలని నగర కమిషనర్ జె అరుణ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ 11వ వార్డుతోపాటు అక్కడున్న సచివాలయాన్ని సందర్శించారు. స్థానికంగా జరుగుతున్న కార్యక్రమాలపై వార్డు కార్యదర్శులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలను సిటిజన్ చార్ట్ ప్రకారం పక్కాగా, సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలు, నిర్దేశించిన ఇతర సమాచారాన్ని వార్డు సచివాలయంలో ప్రదర్శించాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్షించారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూలు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్, నీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. సమస్యలపై స్థానిక కార్పొరేటర్ జయలక్ష్మితో చర్చించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని నగర కమిషనర్ జె అరుణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ బండపల్లె 1, 2 లేఅవుట్లను సందర్శించారు. లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులు, మేస్త్రీలతో మాట్లాడారు. పనులు నిరంతరాయంగా, మరింత వేగంగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఉగాది నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు గోపి, మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

## సుర్రుమంటున్న సూర్యుడు


నిర్మానుష్యంగా కనిపిస్తున్న కొంగారెడ్డిపల్లె రోడ్డు

**చిత్తూరు రూరల్:** నగరంలో భానుడి భగభగలు మొదలైంది. శివరాత్రి ముందు రోజు నుంచే చలితీవ్రత తగ్గుముఖం పడుతోంది. ఉదయం 7 గంటల వరకు చలి ప్రభావం కనిపిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రత 18 డిగ్రీల వరకు నమోదవుతోంది. మార్చి ప్రారంభం కాకముందే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత కనిపిస్తోంది. మధ్యాహ్న 12 గంటల సమయంలో గరిష్ట ఉష్ణోగ్రత 34 డిగ్రీల వరకు నమోదువుతున్నాయి. దీంతో జనం మధ్యాహ్నం పూట బయట తిరగడం మానేస్తున్నారు. నగరంలోని జన సంచారం తగ్గుముఖం పట్టింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.